సాక్షి
పార్వతీపురం మన్యం
I

శనివారం । 22 । జూలై । 2023



న్యూస్‌రీల్

అప్రమత్తతే ప్రధానం



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ

పార్వతీపురంటౌన్: మానవ అక్రమరవాణాపై ప్రజలు అప్రమత్తతతో మెలగాలని సీనియర్ సివిల్‌జడ్జి జి.యజ్ఞనారాయణ సూచించారు. కనిపించకుండా పోయిన, తిరిగి దొరకని పిల్లల కేసులపై జిల్లా కోర్టు సమావేశ మందిరంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.సురేష్‌తో కలిసి పోలీస్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సమాజాన్ని పీడిస్తున్న సమస్యలలో మానవ అక్రమరవాణా ఒకటని తెలిపారు. ఉద్యోగాలు, సినిమా అవకాశాలు, ప్రేమ పేరుతో అమ్మాయిలను నమ్మించి అక్రమ రవాణా చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మహిళలు, పిల్లలను మోసం చేసే ముఠాల పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బీసీహెచ్ స్వామినాయుడు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో పర్యాటకాభివృద్ధి పనులు



ఎస్.కె.పాడు నర్సరీలోని పర్యాటకాభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

గుమ్మలక్ష్మీపురం: ఉద్యానవన నర్సరీలో చేపడుతున్న పర్యాటకాభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కె.పాడు నర్సరీలో చేపట్టిన కాటేజీల నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. సుమారు రూ.90 లక్షల ఖర్చుతో చేపడుతున్న నిర్మాణాలు సకాలంలో పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్‌శాఖ ఈఈ శాంతీశ్వర రావు, డీఈఈ సింహాచలం, ఏఈ అప్పారావుకు సూచించారు.

నిలకడగా తోటపల్లి నీటి ప్రవాహం

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటిప్రవాహం నిలకడగా ఉంది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద శుక్రవారం సాయంత్రానికి 105 మీటర్ల నీటిమట్టానికి 104.24 మీటర్లలో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నదిలో 2,584 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండగా, అధికారులు ఒక గేటును ఎత్తివేసి 4,644 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టీఎంసీలకు గాను 1.87 టీఎంసీల ఉన్నట్టు అధికారులు తెలిపారు.

జంఝావతి నీరు విడుదల



జంఝావతి లెవెల్ కెనాల్ వద్ద సాగునీరు విడుదల చేస్తున్న వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, అధికారులు

కొమరాడ: మండలంలోని జంఝావతి రబ్బర్ డ్యామ్ నుంచి లో లెవెల్ కెనాల్‌కు నీటి పారుదలశాఖ అధికారి వి.అభిషేక్, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు శుక్రవారం సాగునీరు విడుదల చేశారు. మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి కృషితో జంఝావతి నీటితో ఈ ప్రాంత భూములు సస్యశ్యామలయ్యాయని వైస్ ఎంపీపీ పేర్కొన్నారు. కొమరాడ, గరుగుబిల్లి మండలంలోని 12వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోందన్నారు. కొమరాడ మండలంలోని గంగారేగువలస, ఆర్తాం, పరశురాంపురం, చంద్రంపేట, విక్రంపురం తదితర గ్రామాల్లో దమ్ములు ప్రారంభమయ్యాయన్నారు.

రుణ చెల్లింపులతో రాయితీ లబ్ధి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన లబ్ధిదారులు గతంలో ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ ద్వారా తీసుకున్న ట్రైకార్ రుణాల చెల్లింపులు సకాలంలో చెల్లించి రాయితీ లబ్ధి పొందాలని గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర ట్రైకార్ జనరల్ మేనేజర్ సి.మణికుమార్ అన్నారు. ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ సౌత్ జోనల్ మేనేజర్ కృష్ణవేణితో కలిసి గుమ్మలక్ష్మీపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ట్రైకార్ రుణాలు పొందిన లబ్ధిదారులతో శుక్రవారం సమావేశమయ్యారు. తీసుకున్న రుణాల్లో సబ్సిడీని మినహాయించి మిగిలిన రుణాన్ని చెల్లించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, ఏటీడబ్ల్యూఓ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణంతో..
తీరిన చింత

వంతెనలు.. రెండు ప్రాంతాలను కలుపుతూ.. రాకపోకలను దగ్గర చేసే మార్గాలు. ఆ ప్రాంతాల ప్రగతికి 'వారధులు'. అంతటి ప్రాధాన్యమున్న వంతెన నిర్మాణాలను టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ప్రజలకు ప్రయాణ కష్టాలు మిగిల్చింది. ప్రజాసంకల్ప యాత్రలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో వంతెనల ఆవశ్యకతను గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు కేటాయించారు. ఒక్కొక్కటిగా వంతెన నిర్మాణాలను పూర్తిచేయించి ప్రజలకు 'మార్గం' సుగమం చేస్తున్నారు.

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో నాలుగు వంతెన నిర్మాణాలు పూర్తి
- నిర్మాణంలో మరికొన్ని వంతెనలు
- శరవేగంగా సాగుతున్న పనులు
- వీటికోసం రూ.97 కోట్ల కేటాయింపు

విజయనగరం రూరల్/వంగర/సీతానగరం/సాలూరు: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. ఉమ్మడి విజయనగరం జిల్లాలో పలు వంతెనల నిర్మాణానికి పూనుకుంది. ప్రజల రాకపోకలకు వీలుగా అవసరమైన చోట నదులు, వాగులపై వంతెనలు నిర్మిస్తోంది. మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రగతిదారి చూపుతోంది. గత టీడీపీ ప్రభుత్వం మైదాన ప్రాంతాల్లో ప్రధాన నదులపై ఉన్న వంతెనల మరమ్మతుల పనులపై నిర్లక్ష్యం చేయడంతో శిథిలావస్థకు చేరాయి. కొత్తవంతెనల నిర్మాణాలు చేపట్టకుండా మారుమూల, గిరిజన ప్రాంత ప్రజలను అవస్థలకు గురిచేసింది. వీటిని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రోడ్ల అభివృద్ధికి, వంతెనల మరమ్మతులు, కొత్త వంతెనల నిర్మాణానికి రూ.97 కోట్లు కేటాయించింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రవహిస్తున్న ప్రధాన నదులు వేగావతి, చంపావతి, సువర్ణముఖి, నాగావళి తదితర నదులపై అనేకచోట్ల మరమ్మతులకు గురైన, అసంపూర్తిగా ఉన్న వంతెన పనులు పూర్తిచేయడంతో పాటు కొత్త వంతెనల నిర్మాణాలపై దృష్టిసారించింది. ప్రభుత్వ కృషికి జాతీయ రహదారుల శాఖ సహకారం తోడవడంతో పలు వంతెనల పనులు పూర్తికావడంతో పాటు మరికొన్ని నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి.



తగ్గిన దూరం

చిత్రంలో కనిపిస్తున్నది వంగర మండలం రుషింగి, వీరఘట్టం మండలం కిమ్మి గ్రామాల మధ్య నాగావళి నదిపై రూ.29.50 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించిన వంతెన. 2012లో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి వర్చువల్ విధానంలో పనులకు శంకుస్థాపన చేయగా తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం పనుల పూర్తికి చొరవచూపలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంతెన మిగుల పనులను, అప్రోచ్‌రోడ్డు పనులను ఈ ఏడాది మే నెలాఖరు నాటికి పూర్తిచేసింది. వంతెన ప్రారంభోత్సవానికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. వంతెన నిర్మాణానికి ముందు అటు వీరఘట్టం, పార్వతీపురం వెళ్లాలంటే పాలకొండ మీదుగా రాకపోకలు సాగించాల్సి వచ్చేది. వ్యయప్రయాసలు పడేవారు. వంతెన నిర్మాణంతో వంగర వాసులు వీరఘట్టం వెళ్లాలంటే కేవలం 5 నుంచి 6 కిలోమీటర్లు ప్రయాణిస్తే చాలు.



80 గ్రామాల రాచబాట

చిత్రంలో కనిపిస్తున్నది సాలూరు మండలం కందులపదం వద్ద గోముఖి నదిపై నిర్మించిన వంతెన. దీనికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.5.12 కోట్ల నిధులు కేటాయించింది. వంతెన నిర్మాణం పూర్తయింది. వంతెన అందుబాటులోకి రావడంతో సాలూరు మండల కేంద్రానికి సాలూరు మండలం, మక్కువ మండలంలోని 80 గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు సులభతరమయ్యాయి.

శాశ్వత పరిష్కారం చూపారు..



వర్షాలకు గోముఖి నది పొంగి ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోయేవి. సాలూరు మండల కేంద్రానికి వెళ్లాలంటే మార్కండపుట్టి మీదుగా 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. కందులపదం వద్ద జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్మించిన వంతెనతో సాలూరు, మక్కువ మండలాల్లోని మావుడి, అన్నంరాజువలస, తుండ, పట్టుచెన్నేరు, పగులుచెన్నేరు, పనసభద్ర, గైసీల కందులపదం, నంద తదితర పంచాయతీల్లో సుమారు 80 గ్రామాల ప్రజలకు రహదారి సమస్య తొలగింది.

– పీడిక సుదర్శన దొర, మావుడి పంచాయతీ సర్పంచ్

రెండు జిల్లాల ప్రజలకు సౌకర్యం



రుషింగి–కిమ్మి వంతెన నిర్మాణం పూర్తవ్వడంతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ప్రజలకు ఎంతో సౌకర్యం కలిగింది. వంగర మండల ప్రజలు పాలకొండ, పార్వతీపురం, వీరఘట్టం పట్టణాలకు వెళ్లాలంటే వ్యయ, ప్రయాసలకు గురయ్యేవారం. నదిలో నాటు పడవలు దాటుకొని వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు వీరఘట్టం, వంగర మండలాలు ఇంచుమించుగా కలిసిపోయాయి. పాలకొండ, పార్వతీపురం మండలాలకు వెళ్లేందుకు 25 కిలోమీటర్ల దూరం తగ్గింది.

– యలకల భాగ్యలక్ష్మి, సర్పంచ్, రుషింగి, వంగర మండలం

కష్టాలు దూరం



వంతెన నిర్మించని సమయంలో వంగర మండల ప్రజలు భయంభయంతో నాగావళి నదిలో నాటుపడవలపై రాకపోకలు సాగించేవారు. వరద ఉద్ధృతి సమయంలో ఒడ్డుకు చేరే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకునేవారం. 2012లో ప్రారంభమైన వంతెన పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిచేయడంఆనందంగా ఉంది. ప్రయాణ భారం, వ్యయ, ప్రయాసలు తగ్గాయి. సమయం ఆదా అవుతోంది. అర్ధరాత్రి అయినా ఇంటికి చేరుకోవచ్చనే ధైర్యం ఉంది.

– ఏనుగుతల వెంకటనాయుడు, శివ్వాం, వంగర మండలం



చిత్రంలో కనిపిస్తున్నది సీతానగరం మండలం గెడ్డలుప్పి–బగ్గందొరవలస గ్రామాల మధ్య సువర్ణముఖి నదిపై రూ.12.50 కోట్ల ఖర్చుతో నిర్మించిన భారీ వంతెన. ఇది అందుబాటులోకి రావడంతో పార్వతీపురం,బలిజిపేట, మక్కువ మండలాల ప్రజలకు రోడ్డు సమస్య తీరింది. విద్య, వైద్య సదుపాయాలు అక్కరకు వచ్చాయి. ప్రస్తుతం వంతెన పనులు పూర్తికాగా, అప్రోచ్‌రోడ్డు పనులే మిగిలి ఉన్నాయి. దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఈ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. పూర్తయిన వంతెనపై రాకపోకలు సాగిస్తూ మురిసిపోతున్నారు.

50 గ్రామాలకు ఆధారం



గెడ్డలుప్పి–బగ్గందొరవలస గ్రామాల మధ్య సువర్ణముఖి నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి వల్ల 50 గ్రామాల ప్రజలకు రహదారి కష్టాలు తీరుతాయి. వర్షాకాలంలో నది పొంగిప్రవహిస్తే బయటి ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయేవి. విద్యార్థులు పాఠశాలలకు సెలవు పెట్టాల్సిందే. ప్రజాసంకల్పయాత్రలో సమస్యను గుర్తించిన ప్రస్తుత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనులు పూర్తిచేయించారు. అప్రోచ్‌రోడ్ల నిర్మాణమే మిగిలి ఉంది. గ్రామంలోకి 104, 108 వాహనాలు వస్తున్నాయి. పిల్లలు నిశ్చింతగా పాఠశాలలకు వెళ్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు ఇళ్లకు చేర్చుకుంటున్నాం. మాకష్టాలన్నీ తీర్చిన జగనన్నకు రుణపడిఉంటాం.

– అల్లు తిరుపతినాయుడు, సర్పంచ్, గెడ్డలుప్పి, సీతానగరం మండలం



సాలూరు సమీపంలో కాకులతోట వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన

వంతెనల నిర్మాణం ఇలా...

- వేగావతి నదిపై బొబ్బిలి మండలం పారాది వద్ద రూ.10.9 కోట్ల భారీ వంతెన నిర్మాణాన్ని జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు పూర్తి చేసింది.
- సాలూరు మున్సిపాలిటీ పరిధిలోని వేగావతి నదిపై కాకులతోట వద్ద రూ.8.1 కోట్ల వ్యయంతో చేపట్టిన వంతెన నిర్మాణం పనులు చివరి దశకు వచ్చాయి. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే సాలూరుకు పాచిపెంట మండలానికి దూరం తగ్గడంతో పాటు రెండు మండలాల పరిధిలో ఉన్న గిరిజన గ్రామాలకు దూరం తగ్గుతుంది.
- సాలూరు మండల పరిధిలోని దండిగాం వంతెన నిర్మాణానికి రూ.8 కోట్లు నిధులు కేటాయింది. ఇవి టెండర్ దశను పూర్తి చేసుకున్నాయి. వంతెన అందుబాటులోకి వస్తే సాలూరు నుంచి ఒడిశా సరిహద్దు వరకు ఉన్న గిరిజన గ్రామాలకు చక్కని రహదారి సౌకర్యం కలుగుతుంది.
- సాలూరు మండల పరిధిలోని రాళ్లగెడ్డపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.51 కోట్ల నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తిచేసింది. దీంతో పాచిపెంట, సాలూరు మండలాల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. గిరిపుత్రులు ఆనంద పడుతున్నారు.
- గజపతినగరం వద్ద చంపావతి నదిపై జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో రూ.15 కోట్లతో వంతెన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వంతెన నిర్మాణం పూర్తయితే అంతరాష్ట్ర రహదారిపై వాహనాల రాకపోకలు ఇబ్బందులు తొలగిపోతాయి.
- బలిజిపేట మండలం నారాయణపురం వద్ద వంతెన నిర్మాణానికి రూ.12.50 కోట్లను మంజూరు చేసింది. పనులు పూర్తయ్యాయి.

రూ.97 కోట్ల ఖర్చుతో వంతెనల నిర్మాణం



విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలో ప్రధాన నదులపై 7 చోట్ల సుమారు రూ.97.12 కోట్ల ఖర్చుతో వంతెనల నిర్మాణాలు చేపట్టాం. ఇప్పటికే కొన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి. రాకపోకలు జరుగుతున్నాయి. మరికొన్ని వంతెన పనులు చివరిదశలో ఉన్నాయి. అప్రోచ్‌రోడ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే ప్రారంభిస్తాం. ప్రజల రాకపోకలు కష్టాలు తీర్చాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం.

– జి.వి.రమణ, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్, ఆర్అండ్‌బీ, విజయనగరం



నిర్మాణం పూర్తయిన సాలూరులోని రాళ్లగెడ్డ వంతెన

నేతన్న నేస్తం.. జగనన్న ప్రభుత్వం



నమూనా చెక్కును విడుదల చేస్తున్న జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు

- వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ నేతన్ననేస్తం
- ఒక్కో కుటుంబానికి రూ.24 వేలు చొప్పున రూ.50.88 లక్షల ప్రయోజనం

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకంతో చేనేత కార్మికులకు ఆర్థిక ఊతం అందిస్తోందని జేసీ ఆర్. గోవిందరావు తెలిపారు. పథకం కింద జిల్లాలోని 212 మంది చేనేత కార్మికులకు రూ.24 వేలు చొప్పున మొత్తం రూ.50.88 లక్షలు ఆర్థిక సహాయం లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసినట్టు వెల్లడించారు. వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదోవిడత నిధులను తిరుపతి జిల్లా వెంకటగిరి వేదికగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 80,686 మంది చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.193.64 కోట్లను బటన్ నొక్కి జమ చేశారు. జిల్లాలో వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదోవిడత కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. లబ్ధిదారులకు రూ.50.88 లక్షల నమూనా చెక్కును జేసీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడం, మగ్గాల ఆధునీకరణ, వస్త్ర ఉత్పత్తి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 169 మందికి రూ.40.56లక్షలు, 2022–23లో 180 మందికి రూ.43.20లక్షలు ఆర్థిక సహాయం చేసిందన్నారు. చేనేత, జౌళిశాఖ సహాయ అభివృద్ధి అధికారి ఎస్.వెంకటరమణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బతుకులు మారాయి



గత 50 సంవత్సరాల నుంచి మగ్గం పనిచేస్తున్నాను. పెట్టుబడికి ఇబ్బందులు పడేవారం. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక చేనేత కార్మికుల బతుకులు మారాయి. ఇప్పటి వరకు రూ.54వేలు ఆర్థిక సహాయం అందింది.

– సి.లక్ష్మణరావు, రావివలస, గరుగుబిల్లి మండలం

జీవనం సాఫీగా..



గత 40 ఏళ్లుగా మగ్గం పని చేస్తున్నా. వైఎస్సార్‌నేతన్న నేస్తం కింద రెండు విడతల్లో రూ.48వేల ఆర్థిక సహాయం అందింది. వ్యాపారాన్ని విస్తరించాను. నెలకు రూ.7వేలు సంపాదిస్తున్నా. జగనన్న విద్యాదీవెన పథకం కింద కుమార్తె చదువుకు రూ.60 వేలు సాయం అందింది. జగన్ పాలనలో ఆర్థిక కష్టాలు దూరమయ్యాయి.

– ఐ.సత్యనారాయణ, రావుపల్లి, గరుగుబిల్లి మండలం

ఖాతాకే డబ్బులు



నాకు నాలుగు విడతలుగా వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ఏడాదికి రూ.24 వేల చొప్పున రూ.96వేలు ఆర్థిక సహాయం అందింది. నేరుగా నా ఖాతాకే డబ్బులు జమయ్యాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చలువతో చేనేత కార్మికుల జీవితాల్లో కొత్తవెలుగు కనిపిస్తోంది. ఆయన మేలు మరచిపోలేం.

– ఐ.గురువులు, రావుపల్లి, గరుగుబిల్లి మండలం

జాబ్‌మేళాలో 239 మందికి ఉద్యోగాలు



అభ్యర్థికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. 504 మంది నిరుద్యోగ యువతీయువకులు హాజరుకాగా, 17 కంపెనీల ప్రతినిధులు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 239 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. జాబ్‌మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఉద్యోగమేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అవకాశాలను నిరుద్యోగ యువతీ యువకులు అందిపుచ్చుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ మాట్లాడుతూ ఇలాంటి జాబ్‌మేళాలు రాబోయే రోజుల్లో మరిన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీల జీవనంపై చట్టాలతో కేంద్రం దాడి

- ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్ మిడియం బాబూరావు



ఆదివాసీ గిరిజన సంఘం మహా సభలో మాట్లాడుతున్న మిడియం బాబూరావు

కురుపాం: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నూతన చట్టాలతో ఆదివాసీ గిరిజన జీవనంపై దాడిచేస్తోందని ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్, మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. కురుపాంలో జరుగుతున్న ఆదివాసీ గిరిజన ఏడవ మహాసభల్లో శుక్రవారం పాల్గొని మాట్లాడారు. బాక్సైట్ తవ్వకాల పేరుతో అడవి నుంచి ఆదివాసీలను తరుముతోందన్నారు. గిరిజనులకు వెన్నుముకగా ఉన్న జీఓ నంబర్ 3 రద్దు చేసి ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిందన్నారు. 1/70 చట్టం పకడ్బందీగా అమలు జరగడం లేదన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మోదీ ప్రభుత్వం ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నాలు చేపట్టిందని, ఇదే జరిగితే 1500 మంది గిరిజన ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోల్పోతారన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను కలిసికట్టుగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.రాజేంద్ర, ఎస్.అప్పారావు, ఎం.లక్ష్మణరావు, శ్రీనివాసరావు, సీతారాం, కె.రామస్వామి, ఎన్.శ్రీరాములు, పి.తిరుపతిరావు, బి.వెంకటరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా సహస్ర దీపాలంకరణ


దీప కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన అనంతరం తాత్కాలిక యాగశాలలో విశేష హోమం చేశారు. తరువాత స్వామి వెండి మంటపం వద్ద నిత్య కల్యాణ వేడుకను కనుల పండువగా జరిపించారు. సాయంత్రం 6గంటలకు ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగింపుగా తీసుకువెళ్లి సహస్ర దీపారాధన మంటపంపై ఉన్న ప్రత్యేక పల్లకిలో వేంచేపు చేశాక సహస్ర దీపాలను వెలిగించి స్వామికి ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు నలుగురు క్రీడాకారిణుల ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన క్రికెట్ క్రీడాకారిణులు

శృంగవరపుకోట: పట్టణంలోని మహి క్రికెట్ అకాడమీకి చెందిన నలుగురు క్రీడాకారిణులు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నేతృత్వంలో నిర్వహించనున్న మహిళల వన్‌డే పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ మేరకు అండర్–19 విభాగానికి సంబంధించి గంద్రెడ్డి తులసి, అనపర్తి హరిణి, సీనియర్స్ విభాగంలో చిప్పాడ లిఖిత, జాన పవిత్ర, జిల్లా జట్టులో ప్రాతినిధ్యం వహిస్తారు. అండర్–19 పోటీలు జూలై 21 నుంచి 23వ తేదీ వరకూ, సీనియర్స్ విభాగం పోటీలు జూలై 25 నుంచి 27వరకూ విజ్జీ స్టేడియంలో జరుగుతాయని కోచ్ బంక శ్రీను తెలిపారు.

25న మినీ జాబ్ మేళా

చీపురుపల్లి: నిరుద్యోగ యువత కోసం ఏపీ స్కిల్ హబ్, స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలోని జేకేసీ సంయుక్తంగా ఈ నెల 25న మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెటిరో డ్రగ్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించేందుకు స్థానిక కళాశాల ప్రాంగణంలో 25న ఉదయం 10 గంటల నుంచి ఆ పరిశ్రమల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. హెటిరో డ్రగ్స్ పరిశ్రమలో 80 ఖాళీలు ఉన్నాయని, ఈ పోస్టులకు బీఎస్సీ, బీకాం, ఎంఎస్సీ, బీఏ, ఐటీఐ, డెక్కన్ ఫైన్ కెమికల్స్‌లో 120 ఖాళీలు ఉన్నాయని, ఈ పోస్టులకు బీఎస్సీ కెమిస్ట్రీ, సీబీజెడ్ గ్రూపులతో పాటు ఎంఎస్సీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ విద్యార్హత కలిగి, 18 నుంచి 27 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

కాపునేస్తం లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకోవాలి

పార్వతీపురం: వైఎస్సార్ కాపునేస్తం పథకం లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.గడ్డెమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాపునేస్తం పథకం కింద అర్హులైన 45–60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన ఓసీ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన మహిళా లబ్ధిదారులకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.15వేలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. నాలుగవ సంవత్సరం అర్హత కలిగిన లబ్ధిదారులకు ఆగస్టు నెలలో వారి ఖాతాలలో నగదు జమ కానున్నట్లు తెలిపారు. ఈ మేరకు అర్హులు ఆధార్ ప్రామాణికంగా ఈకేవైసీ చేసుకోవాలని కోరారు. అలాగే గతంలో లబ్ధిపొందిన వారు కూడా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,650–00
బంగారం(22సి. 10గ్రా.)	55,600–00
వెండి (కిలో)	82,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఒక కుటుంబం ఓట్లు

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితాలను రూపొందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను కోరారు. అలాగే ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై మండలాల వారీగా తహసీల్దార్లు, డీటీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఆమె సమీక్షించారు. బీఎల్‌ఓల ఇంటింటి సర్వే జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన సందర్భంగా దీనికి సంబంధించి పలుసూచనలు చేశారు. ఓటర్ల జాబితా తయారీలో నిర్లిప్తతను నిర్లక్ష్యాన్ని విడనాడాలని, ఒక్క తప్పు కూడా దొర్లకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ వాటికి అనుగుణంగా జాబితాలను రూపొందించాలని చెప్పారు. చిన్న తప్పు చేసినా పెద్ద శిక్ష పడే ఆస్కారం ఉందని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఈఆర్‌ఓలు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 84 దరఖాస్తులు


వినతులు వింటున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 84 దరఖాస్తులు అందాయి. వాటిలో కొన్ని వ్యక్తిగత, ఆర్థిక అంశాలకు సంబంధించినవి కాగా కొన్ని యూనియన్‌ల ద్వారా పలు అంశాలపై దరఖాస్తులు అందాయి. నాల్గవ తరగతి ఉద్యోగ సంఘం ప్రతినిధులు ఇండ్ల స్థలాల మంజూరు కోసం, ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. అదేవిధంగా పెండింగ్ డీఏలు, సరెండర్ లీవ్‌లు మంజూరు చేయాలని, ఉద్యోగుల హెల్త్ కార్డులపై క్యాష్‌లెస్ వైద్యం అందేలా చూడాలని వినతులు ఇచ్చారు. ఖాళీగా ఉన్న నాల్గవ తరగతి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పలువురు ఉద్యోగులు గ్రీవెన్స్‌లో విన్నవించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. రిటైర్ అయిన వివిధ కేడర్ ఉద్యోగ, అధికారులకు సేవందించడంలో సిబ్బంది కొన్ని చోట్ల సహకారం అందించడం లేదని ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఎంఈఓ జీఎస్‌ప్రకాశరావు కోరుతూ వినతిపత్రం అందజేశారు. వినతులను జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు, ప్రభుత్వానికి పంపించి తగుచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కొమరాడలో జేజేఎం కమిటీ పర్యటన


దంగభద్రలో అవగాహన కల్పిస్తున్న కేంద్ర జల జీవన్ మిషన్ కమిటీ సభ్యులు

కొమరాడ: మండలంలోని కోనవలస, డంగభద్ర, కందివలస, సుందరాపురం, అంకుళ్లవలస, కోమట్లపేట, బంగారమ్మపేట తదితర గ్రామాల్లో జాతీయ జలజీవన్ మిషన్ (జేజేఎం) కమిటీ సభ్యులు సోహన్‌లాల్ సల్వీ, రమేష్ చంద్రమిశ్రా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటిసరఫరా, పారిశుద్ధ్య శాఖ నిర్వహించిన ఇంటింటి కుళాయి(జేజేఎం పథకం) నిర్వహణపై ఈ సందర్భంగా ఆరా తీశారు. ఆయా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి వాటర్ శ్యాంపిల్‌ను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో విలేజ్ వాటర్, శానిటేషన్ కమిటీ ఏర్పాటు చేసి ప్రతి కుళాయికి కొంతమొత్తాన్ని వసూలు చేసి పథకం నిర్వహణకు ఖర్చుచేయాలని సూచించారు. అలాగే పథకంలోని లోపాలను సరిదిద్దాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. కచ్చితంగా నీటి సరఫరా ఆపరేటర్‌ను వేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరాశాఖ డీఈ నాగేశ్వరరావు, ఏఈ నవీన్‌కుమార్, వైస్ సర్పంచ్ నంగిరెడ్డి శరత్ బాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

28న మెగా జాబ్ మేళా

పార్వతీపురంటౌన్: స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను ఈనెల 28న నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు తెలిపారు. వర్క్‌రూట్, సీప్ ఆధ్వర్యంలో భాస్కర్ డిగ్రీ కళాశాలలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని, ఆరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా జరుగుతుందని పేర్కొన్నారు. 10 కంపెనీలు ఈ జాబ్ మేళాకు హాజరు కానున్నాయని తెలిపారు. 2019వ సంవత్సరం నుంచి 2022 సంవత్సరాల మధ్యలో డిగ్రీ పాసైన విద్యార్థులు, 2023వ సంవత్సరంలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8019719234, 8074231274 నంబర్లలో సంప్రదించాలని తెలియజేశారు.

కొరటాంలో ఏనుగుల తిష్ఠ

- మామిడి తోటలో సంచారం


కొరటాం గ్రామం మీదుగా మామిడి తోటలోకి వెళ్తున్న ఏనుగులు

తెర్లాం: గడిచిన ఐదు రోజులుగా మండలంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు శుక్రవారం ఉదయానికి కొరటాం గ్రామానికి సమీపంలోని మామిడి తోటలో తిష్ఠ వేసింది. గురువారం ఉదయం రంగప్పవలసలో రైస్‌మిల్లును ధ్వంసం చేసి మెరకముడిదాం మండలం ఎం.గదబవలస గ్రామానికి చెందిన మామిడి తోటల వైపు వెళ్లిపోయిన ఏనుగులు అదే రోజు రాత్రి మళ్లీ రంగప్పవలస, తమ్మయ్యవలస గ్రామాల వైపు వచ్చేశాయి. తమ్మయ్యవలస నుంచి తెర్లాం గుర్రమ్మ చెరువు మీదుగా కొరటాం గ్రామం వైపు శుక్రవారం వచ్చాయి. కొరటాం ఆర్బీకే, చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం పక్క నుంచి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నునగొప్పుల రాము మామిడి తోటలోకి ఏనుగుల గుంపు వెళ్లింది. గ్రామంలోకి ఏనుగులు వచ్చాయని ఎస్సై ఆర్.రమేష్‌కు స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఆయన సిబ్బందితో హుటాహుటిన గ్రామానికి చేరుకుని ప్రజలు, రైతులు మామిడి తోటల్లోకి, పొలాలకు వెళ్లవద్దని మైక్‌సెట్ ద్వారా ప్రచారం చేయించారు. సమాచారం మేరకు గ్రామానికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది, ట్రాకర్స్ మాట్లాడుతూ గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, ఏనుగులను చూసేందుకు ఎవ్వరూ వెళ్లవద్దని, వాటిని కవ్వించవద్దని సూచించారు.

మందుల అక్రమ నిల్వ

- ముద్దాయికి మూడేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా

విజయనగరం లీగల్: లైసెన్స్ లేకుండా ఇంట్లో వివిధ రకాల మందులు(ఔషధాలు) అక్రమంగా నిల్వ చేశాడన్న ఆరోపణ రుజువు కావడంతో గంట్యాడ మండలం నరవ గ్రామానికి చెందిన మల్లపురెడ్డి శ్రీనివాసరావుకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా అదనపు మొదటి న్యాయమూర్తి జి.రజని శుక్రవారం తీర్పుచెప్పారు. డ్రగ్స్, కాస్మోటిక్స్ చట్టం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతపల్లి అప్పారావు ఈ కేసుకు సంబంధించి అందించిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ యుగంధర్ తనకు అందిన సమాచారం మేరకు మధ్యవర్తుల సమక్షంలో నిందితుడు శ్రీనివాసరావు ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో వివిధ కంపెనీలకు చెందిన మందులతో పాటు అమ్మకాలు నిషేధించిన శాంపిల్స్ పట్టుబడ్డాయి.ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకుని శ్రీనివాసరావుపై డ్రగ్స్, కాస్మోటిక్స్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలతో కేసు రుజువు చేయడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పుచెప్పారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

- సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి


విజేతలతో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మహంతి, వర్సిటీ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్:

మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీకే మహంతి అన్నారు. ఈ మేరకు మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో సెంచూరియన్ లీగ్ ఓపెన్ టోర్నమెంట్–2023 విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, యువత తమకు నచ్చిన క్రీడల్లో ప్రావీణ్యం పొందాలని పిలుపునిచ్చారు.

ఏ రంగంలోనైనా గెలుపోటములు సహజమని ఓటమిని ఆహ్వానించి లక్ష్య సాధనకు కృషి చేయాలని హితవు పలికారు. రిజిస్ట్రార్, డిప్యూటీ రిజిస్ట్రార్‌లు డాక్టర్ పల్లవి, ఆర్‌ఎస్ వర్మ మాట్లాడుతూ వర్సిటీలో అన్ని రకాల క్రీడలకు అనువుగా మైదానాలను సిద్ధం చేశామన్నారు. ఈ టోర్నీలో ఆయా క్రీడల్లో 30 గ్రామాల కు చెందిన జట్లు తలపడ్డాయి. క్రికెట్‌లో విన్నర్‌గా గొ ట్లాం జట్టు, రన్నర్‌గా రామవరం జట్లు నిలిచాయి. వాలీబాల్‌లో చీపురుపల్లి ఎంవీజీఆర్ జట్టు విన్నర్‌గా, మొయిద జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు వర్సి టీ ప్రతినిధులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీన్‌లు రమణారావు, ఆచార్యులు, సన్నీడియోల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్‌లో గుండెపోటుతో యువకుడి మృతి


గుండెపోటుతో మృతిచెందిన శ్రీహరి

రాజాం సిటీ: ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడి ఆదుకుంటాడనుకున్న కుమారుడు గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. కుమారుడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ తండ్రి మరణ వార్త విని నిశ్చేష్టుడయ్యాడు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పొందూరు మండలం ధర్మపురం గ్రామానికి చెందిన మొదలవలస సింహాచలం భార్యా పిల్లలతో కలిసి బతుకు తెరువుకోసం రాజాం మండలం మొగిలివలస వచ్చి నివాసం ఉంటున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహాలు జరిగాయి. శ్రీకాకుళం రోడ్డులో టీ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా ఐదేళ్ల క్రితం భార్య మృతిచెందింది. అప్పటి నుంచి కుమారుడి సహాయంతో జీవనం సాగిస్తున్నాడు. పీజీ వరకు చదువుకున్న కుమారుడు మొదలవలస శ్రీహరి (28) పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. పోటీ పరీక్షల్లో భాగంగా దేహదారుఢ్యం కోసం ఎప్పటిలాగే శుక్రవారం మొగిలివలస నుంచి బొబ్బిలి రోడ్డులోని ఫైర్ స్టేషన్ వద్దకు వాకింగ్‌చేసుకుంటూ వచ్చాడు. అక్కడ గ్రౌండ్‌లో ఉన్నట్లుండి కుప్పకూలిపోయాడు. అది గమనించిన ఫైర్‌స్టేషన్ సిబ్బంది హుటాహుటిన రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

జూలై 28కి లక్ష్మీపేట కేసు వాయిదా

వంగర: మండల పరిధి లక్ష్మీపేట కేసు విచారణ జూలై 28వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రత్యేక న్యాయస్థానంలో జడ్జి ఫణికుమార్ కేసు విచారణ చేపట్టి వాయిదా వేశారు. ఈ కేసులో 80 మంది నిందితులకు గాను గతంలో 12 మంది మరణించగా 67 మంది హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారు. రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్సై ఆర్.జనార్దనరావు, సిబ్బంది విచారణ సందర్భంగా పాల్గొన్నారు.

పోలీసులపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

వీరఘట్టం: పోలీసులపై దౌర్జన్యం చేసిన వీరఘట్టానికి చెందిన మీసాల చంటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎంవీ రమణ శుక్రవారం తెలిపారు. వీరఘట్టం బీసీ కాలనీలో మీసాల చంటి, అతని భార్య మధ్య తగాదా జరుగుతోందని డయల్ 100కు గురువారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు ఒక హోం గార్డు, కానిస్టేబుల్ ఆ ఇంటికి వెళ్లారు. పోలీసులు రావడంపై చంటి ఆగ్రహం వ్యక్తం చేసి దౌర్జన్యానికి దిగాడు. దీంతో మరో ఇద్దరు కానిస్టేబుల్స్, ఎస్సై, ఏఎస్సై సంఘటనా స్థలానికి వెళ్లారు. వారిపైన కూడా మీసాల చంటి దురుసుగా వ్యవహరించడంతో పాటు కానిస్టేబుల్ ప్రసాద్‌పై దౌర్జన్యానికి దిగాడు. ఈ మేరకు కానిస్టేబుల్ ప్రసాద్ ఫిర్యాదు చేయగా చంటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

'సమతా'కు తప్పిన ముప్పు

- ఇంజిన్ నుంచి విడిపోయిన బోగీలు
- ఆందోళన చెందిన ప్రయాణికులు
- ఎమర్జెన్సీ బ్రేక్ వేసి ఆపిన గార్డ్


పార్వతీపురంలో విడిపోయిన బోగీల వద్దకు వస్తున్న ఇంజిన్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గుండా వెళ్తున్న సమతా ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. ఎక్స్‌ప్రెస్ ఇంజిన్ నుంచి బోగీలు విడిపోయాయన్న విషయం పార్వతీపురం పట్టణమంతా వ్యాపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం టౌన్–పార్వతీపురం స్టేషన్ల మధ్యలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు చేపట్టిన మెగాబ్లాక్ పనులు పూర్తి చేసిన రైల్వే అధికారులు రైళ్ల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా సాయంత్రం 5 గంటల సమయంలో లైన్స్ క్లియర్ చేశారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 1.55 గంటల సమయంలో రావాల్సిన నిజాముద్దీన్- విశాఖపట్నం సమతా ఎక్స్‌ప్రెస్ మరికొద్ది సేపటిలో 3వ నంబర్ ఫ్లాట్‌ఫారం మీదికి రానున్నదని రాత్రి 7.20 గంటలకు పార్వతీపురం స్టేషన్‌లో అనౌన్స్ చేశారు. పది నిమిషాల్లో హారన్ కొడుతూ 7.30 గంటలకు సమతా ఎక్స్‌ప్రెస్ ఇంజిన్ మాత్రమే 3వ నంబర్ ప్లాట్ ఫాం మీదికి వచ్చింది. విడిపోయిన బోగీలలో వెనక బోగిలో ఉన్న గార్డ్ ఈ విషయాన్ని గమనించి ఇంజిన్ లేకున్నా కదులుతున్న బోగీలను ఎమర్జెన్సీ బ్రేక్ వేసి ఆపడంతో బోగీలన్నీ పార్వతీపురం టౌన్ -పార్వతీపురం స్టేషన్ల మధ్యలో ఆగిపోయాయి. ఇంజిన్ లేకుండా బోగీలన్నీ సుమారు అరకిలోమీటరు వరకు ప్రయాణించాయి. గార్డు అప్రమత్తం కావడం వల్ల పెనుముప్పు తప్పడంతో ప్రయాణికులంతా ఊపిరిపీల్చుకున్నారు. మెగాబ్లాక్‌లో భాగంగా చేపట్టిన మెయింటనెన్స్ పనుల్లో ఎక్కడో ఒకచోట కపిలింగ్ ఊడిపోవడం వల్ల ఇంజిన్ నుంచి బోగీలు వేరు పడ్డాయని టెక్నీషియన్లు తెలిపారు. తర్వాత ఇంజిన్‌ను వెనక్కి తీసుకువెళ్లి టెక్నీషియన్లు కపిలింగ్ వేయడంతో రాత్రి 9 గంటల సమయంలో పార్వతీపురం స్టేషన్ నుంచి గంటన్నర ఆలస్యంగా సమతా ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం బయలుదేరింది.

8మంది జూదరుల అరెస్ట్


పోలీసులు అరెస్ట్ చేసిన జూదరులు

గుర్ల: మండలంలోని గుజ్జంగివలస శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై హరిబాబు నాయుడు శుక్రవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 58,950 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జూదరులపై కేసు నమోదు చేశారు. గ్రామాల్లో పేకాట, మద్యం అమ్మకాలు జరుగుతుంటే పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని ఈ సందర్భంగా ఎస్సై కోరారు.

చూపు కోల్పోయిన వ్యక్తికి అరుదైన చికిత్స


పూర్తిగా కోలుకున్న రోగి మోహనరావుతో వైద్యుల బృందం

ఎంవీపీకాలనీ:

కంటి చూపు కోల్పోయిన వ్యక్తికి ఎంవీపీకాలనీలోని మెడికవర్ వైద్యులు అరుదైన చికిత్స అందించి నయం చేశారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్వతీపురానికి చెందిన మోహనరావు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని ఎంవీపీకాలనీలోని మెడికవర్ ఆస్పత్రి తీసుకురాగా.. వైద్యులు చికిత్స అందించి డిశ్చార్జ్ చేశారు. రెండు రోజుల అనంతరం అతనికి కంటిచూపు సమస్య తలెత్తింది. క్రమంగా కంటి చూపు కోల్పోవడంతో తిరిగి మెడికవర్‌కు తీసుకొచ్చారు. కనీసం కళ్లు కూడా తెరవలేని పరిస్థితుల్లో ఉన్న అతనికి సీనియర్ కన్సల్టెంట్ న్యూరో వాస్కులర్ ఇంటర్వెన్షన్ డాక్టర్ సిబాశంకర్ దలైలతో కూడిన బృందం వైద్యం ప్రారంభించింది. అన్ని పరీక్షలు చేసి అనంతరం కరోటికో కావెర్నస్ ఫిస్టులా(సీసీఎఫ్) అనే అరుదైన, సంక్లిష్టమైన న్యూరో వాస్కులర్ వ్యాధికి అతను గురైనట్లు గుర్తించారు. దీంతో ఎంబోలైజేషన్ శస్త్ర చికిత్స ద్వారా ప్రొసీజర్ నిర్వహించి.. కంటి చూపుతో పాటు అతని ప్రాణాలను కాపాడారు. ఈ అరుదైన చికిత్స ద్వారా రోగి పూర్తిస్థాయిలో కోలుకున్నట్లు వైద్యులు వెల్లడించారు. శస్త్ర చికిత్సలో డాక్టర్ టి.వినయ్ భూషణం, డాక్టర్ అరవింద, డాక్టర్ మోహన్ మహారాజ్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మోహన్, డాక్టర్ రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.